
''వీటిని ప్రచురిస్తున్నారా?'' అన్నాడతను.

''పత్రికలకు పంపడానికి మనవాళ్లు ఒప్పుకోరు. మన పత్రికల్లో ప్రచురించే కవిత్వం, కథలు వేరు. ఇవన్నీ నా కోసం. ఇలాంటి తీవ్రత లేకపోతే నేను ఉద్యమంలోకి వచ్చేదాన్ని కాదు'' అన్నదామె.

అతను తల పంకించాడు.

ఇద్దరూ కూర్చున్నప్పుడు మాట్లాడుకునేవారు. మొదట్లో కాస్త ముభావంగా ఉన్నా.. క్రమంగా వారిద్దరి మధ్య ఓ అనుబంధం ఏర్పడింది.

''మనం పత్రికలకు మన రచనలు పంపకపోతే అందులో ప్రజలకు వ్యతిరేకమైన రచనలే వస్తుంటాయి. మనం ఆ స్పేస్‌ని ఉపయోగించుకోవాలి కదా! అవి చదివేది



కూడా పాఠకులే కదా!'' అన్నాడతను.

''మన రచనలను ఆ పత్రికల వారు ప్రచురిస్తారా!? అనేది పక్కన ఉంచుదాం. మన సంస్థ ఇలాంటి నిర్ణయం తీసుకోవడం వెనక ఓ కారణం ఉంది. మనం వ్యక్తిగత ప్రచారాలకు లోబడిపోతాం అని. మనం ఇంతకుముందు నుంచి గమనిస్తున్నాం. కొంతమంది కవులు, రచయితలు కేవలం సంస్థను ఉపయోగించుకోవడానికి వస్తున్నారు. వారికి కాస్త పేరు రాగానే సంస్థ నుంచి బయటికి వెళ్తున్నారు. అందుకోసం ఇలాంటి లక్షణాలు పొడచూపకుండా కట్టడి కావచ్చు''.

''నేను మీతో మాట్లాడవలసిన విషయాలు కొన్ని ఉన్నాయి'' అన్నాడతను.

''మాట్లాడండి'' అన్నదామె.

''ఇప్పుడు కాదు. నాకు మరికొంత క్లారిటీ రావాలి. అప్పుడు!'' అన్నాడతను.

* * *

ఈ ఉద్యమంలో అందరూ ఒకేచోట పనిచేయడం సాధ్యంకాదు. అందులోనూ ఇది రహస్య నిర్మాణం. రకరకాల ప్రాంతాలకు ఉద్యమం విస్తరిస్తుంటుంది. అక్కడి అవసరాల కోసం కొంతమందిని పంపిస్తుంటారు. నిరంతరం రిక్రూట్‌మెంట్ జరుగుతుంటుంది. కొంతమంది కొరియర్లుగా ఉంటారు. ఇంకొంతమంది పూర్తికాలం కార్యకర్తలుగా పని చేస్తుంటారు. అందులో రకరకాల వడపోతలు ఉంటాయి. కార్యకర్తలుగా మొదలైన వారు క్రమంగా వారి అనుభవాన్ని, అధ్యయనాన్ని, నిజాయితీని దృష్టిలో ఉంచుకుని రకరకాల నాయకత్వ బాధ్యతల్లోకి ప్రమోట్ చేస్తుంది అగ్రనాయకత్వం.

ఇక పట్టణాల్లో, నగరాల్లో బహిరంగంగా పని చేస్తుంటారు కొంత మంది. వారు అనేక ప్రజా సంఘాల్లో ఉంటారు. పౌరహక్కుల నుంచి కార్మిక, కర్షక సంఘాల వరకు ఉంటాయి. సాహితీ, సాంస్కృతిక సంస్థలు ఉంటాయి. అందులో కొన్ని కొంత కాలం నిషేధానికి గురవుతుంటాయి. వీటిలో పని చేసేవారు కూడా అజ్ఞాతంలోకి వెళ్తుంటారు.

అతను – ఆమె ఇతర ప్రాంతాలకు వెళ్తున్నారు. అదే చివరి సమావేశం.. వారిద్దరిది.

''మళ్లీ మనం కలుసుకుంటామో లేదో తెలియదు!'' అన్నాడతను కాస్త విషాదంగా.

''అవును. మనతో పాట, కవిత్వం మాత్రమే కాదు.. మృత్యువు కూడా మన పక్కనే నడుస్తుంటుంది'' అన్నదామె.

''మృత్యువుకు నేను భయపడను. అది ఎప్పటికైనా అనివార్యమని మనకు తెలుసు. అందుకు సిద్ధపడే ఈ ఉద్యమంలోకి వచ్చాం. నేను చాలా సంవత్సరాల తర్వాత మా ఊరు వెళ్లినా.. అమ్మానాన్నలను కలుసుకోలేదు. బంధువులకు లోబడతానని భయం కలిగింది. ఇప్పుడు నువ్వు, నేనూ ఇతర ప్రాంతాలకు వెళ్తున్నాం. చాలా బాధగా ఉంది. ఇది మాత్రం బంధం కాదా?''.

ఆమె మాట్లాడకుండా చూపులు పక్కకు తిప్పుకొన్నది.

''మనుషులు బంధాలను తెంచుకోవడం సాధ్యం అవుతుందా?''.

''అది అసాధ్యం మిత్రమా!'' అన్నదామె.

మళ్లీ వారి మధ్య మాటలు కరువయ్యాయి.

''ఇంతకుముందు.. 'కొంత క్లారిటీ వచ్చాక మాట్లాడే విషయాలున్నాయి' అన్నావు. క్లారిటీ వచ్చిందా కామ్రేడ్!''.

అతను ఆమె కళ్లలోకి చూశాడు.

ఓ నీటి పొర కళ్లను కమ్మింది.

''దుఃఖ పడుతున్నావా?'' అన్నదామె.

''ఉద్యమకారులు ఏడవరా? వాళ్లు బండరాళ్లా? మనుషులకుండే అన్ని లక్షణాలకు వారు అతీతులా నేస్తం'' అన్నాడతను.

''ముందు మనం మనుషులం. పుట్టుకతో ఎవరూ ఉద్యమకారులుగానో, భక్తులుగానో పుట్టరు. పరిస్థితులు వారిని అలా మారుస్తాయి'' అన్నదామె.

అతను మాట్లాడటం మొదలుపెట్టాడు.

''పాట.. నన్ను ఈ ఉద్యమంలోకి తీసుకువచ్చింది. నేను ఎన్నో పాటలు రాశాను. అవన్నీ జనం ఆదరణ పొందాయి. అనేక సమావేశాలకు వెళ్లాను. అక్కడ నా పాటను కళాకారులు పాడుతుండేవారు. అది వింటున్న ప్రజల కళ్లలో ఆనందం... ఆగ్రహం, రకరకాల భావాలు నేను చూస్తుండేవాణ్ని. కానీ, నా పాట సంస్థ పేరు మీద ఉంటుంది. అది నా కడుపులో పుట్టిన పాట. నా బిడ్డ అది. కానీ నేను 'అది నా బిడ్డ!' అని చెప్పుకోలేను''.

''ఉద్యమం కోసం అమ్మానాన్నలను, కుటుంబాన్ని కూడా వద్దనుకున్నావు కదా కామ్రేడ్!''.

''నిజమే! ఒక్క ప్రశ్న అడుగుతాను!''.

''అడుగు నేస్తం''.

''ఈ ఉద్యమానికి మార్క్స్ సిద్ధాంతం ప్రేరణ. దాన్ని అభివృద్ధి చేసినవాడు లెనిన్. తమ దేశానికి అన్వయించుకున్న వాడు మావో. వీళ్లందరి పేర్లూ చరిత్రలో ఉన్నాయి. వారి రచనల్లో ఉన్నాయి. అలాగే మన దేశంలో కమ్యూనిస్టు, విప్లవ నాయకులందరి పేర్లతో, నాయకత్వంతో ఉద్యమాలు నడుస్తున్నాయి. ఇంక స్వతంత్ర పోరాటం, రాజ్యాంగ నిర్మాణంలో పాలుపంచుకున్న మహానాయకుల పేర్లు ఉన్నాయి. వారందరికీ లేని ఈ 'వ్యక్తిగత' సమస్య కవులకేనా, పాటల రచయితలకేనా? ఈ పాటను రాసింది ఫలానా వ్యక్తి అంటే ఏమవుతుంది? అతను పతనమవుతాడా? సినిమాల్లోకి వెళ్లిపోతాడా? పాలకవర్గ రాజకీయాల్లోకి వెళ్తాడా?''.

''ఈ పాటను తయారుచేయడంలో అందరి పాత్ర ఉంటుంది కదా!''.

''ఉంటుంది. ఎవరన్నా ఓ పదం అదనంగా జోడించవచ్చు. ఆ మాటకొస్తే పాటకు సంగీతాన్ని మరొకరు అందిస్తారు. వారి పేరు కూడా ఉంటుంది. ఇక్కడ ప్రశ్న బీజం ఎవరిది?''.

''మరోలా అనుకోవద్దు. చర్చ కోసం అడుగుతున్నాను.. జానపద గీతాలు సృష్టించిన వారి పేర్లు మనకు తెలియదు. అవి జనం నుంచి, తరాల నుంచి, దేశాల నుంచి అలా ట్రావెల్ చేస్తుంటాయి. వాటి మీద హక్కు ఎవరికి ఉంటుంది? జానపద గీతం ఆధారంగానే అనేక పాటలు తయారవుతున్నాయి కదా!'' అన్నదామె.

''మంచి ప్రశ్న కామ్రేడ్! జానపద గీతంలోని పల్లవిని తీసుకోవడం వేరు. కొన్ని చరణాలు వాడుకోవచ్చు. వాటి మీద ఎవరికీ హక్కులు ఉండవు. అందుకు కారణం మూల రచయితల గురించి తెలియకపోవడం. అవి ఉపయోగించుకుని తయారుచేసిన గీతంలో ఆత్మ ఎవరిది? ఆ రచయితదే కదా!? మార్క్సిజానికి గానీ ప్రపంచంలో ఉన్న మరే తత్వశాస్త్రానికి గానీ.. అంతకుముందు ఆధారాలు లేవా? అప్పటికప్పుడు ఆకాశం నుంచి పుట్టాయా? వాళ్లు చేసింది లోపాలను సవరించడం, ఖాళీలను పూరించడం, తలకిందులుగా ఉన్నవాటిని సరిగ్గా నిలబెట్టడం. అది కదా శ్రమకు ఇచ్చే గౌరవం. అలానే ఈ తత్వశాస్త్రాలు, రాజ్యాంగాలను ఒక్కరు మాత్రమే రూపొందించారా?'' అన్నాడతను.

ఆమె అతని కళ్లలోకే చూస్తున్నది.

''వ్యక్తిగత బలహీనతలకు లోనవుతారని కదా ఇవన్నీ. అలాంటప్పుడు అది అందరికీ వర్తిస్తుంది కదా. కొంత మందిని ఎందుకు ప్రమోట్ చేస్తున్నారు. నగరాల్లో ఉండే వారికి, అజ్ఞాతంలో ఉన్నవారికి మధ్య ఉన్న అంతరాలు ఏమిటి? పాట రాసిన వారు ఒకరైతే ఇంకొకరి పేరు మీద చెలామణి కావడం ఏంటి? ఇంకో విషయం. నగరంలో ఉన్నవారు మాత్రమే లొంగుబాటలో ప్రయాణం చేయడం లేదు. అడవుల్లో ఉన్నవారూ అనేకమంది అదే బాటలో ఉండటం మన అనుభవం కదా! అయినా 'వ్యక్తి' సమస్య కొత్త సమాజం వచ్చేంత వరకేనా?